క్లుప్తంగా

హాకీ జట్టులో ప్రతిభ



తృతీయ స్థానంలో నిలిచిన తెలంగాణ హాకీ జట్టు

శివ్వంపేట(నర్సాపూర్): జాతీయ స్థాయిలో జరిగిన హాకీ పోటీల్లో మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన కల్లూరి హర్షిత్ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర హాకీ జట్టులో ఎంపికైన ఎంపీపీ హరికృష్ణ హర్షిత్ ఒడిస్సాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో విజయం సాధించి తృతీయ స్థానంలో నిలిచినట్లు సర్పంచ్ కీర్తనహన్మంత్‌రావు తెలిపారు.

ఇంటింటికీ చీరల పంపిణీ



పంపిణీ చేసిన చీరలతో మహిళలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటతో పాటు పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటికీ చీరలను పంపిణీ చేశారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆదేశాల మేరకు నియోజకవర్గ ప్రజలకు పండగ కానుకగా చీరలను పంపించగా ఇంటింటికి వెళ్లి చీరలను అందించినట్లు మండలాధ్యక్షుడు భూపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించండి



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్: సీసీరోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని 13 వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, వర్క్ ఇన్స్‌పెక్టర్ భూపాల్, కౌన్సిలర్లు సురేశ్, యాదగిరి ఇతర నాయకులు శ్రీనివాస్, మేఘరాజ్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి మంజూరు పత్రాల పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని భాగీర్థిపల్లి గ్రామంలో గృహలక్ష్మి లబ్ధిదారులకు సర్పంచ్ దయానంద్ మంజూరు పత్రాలను అందించారు. మంగళవారం గ్రామ పంచాయతీ వద్ద లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఇచ్చి, సకాలంలో గృహాలు నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

నర్సాపూర్‌రూరల్: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి , సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, ఆశ వర్కర్లు రేణుక, వెంకటలక్ష్మి, స్వప్న, మంజుల, పద్మ, రాణి పాల్గొన్నారు.

మెదక్ మున్సిపాలిటీ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు మంగళవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వారాజ్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి సావిత్రి, నాయకురాలు స్వప్న, మంజుల, పద్మ, రాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన

మెదక్ కలెక్టరేట్: రెగ్యులరైజ్ లక్ష్యంగా శాంతియుత సమ్మె ప్రారంభించిన ఈ గ్రామ పంచాయతీ ఆపరేటర్లు మంగళవారం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో నిరసన కొనసాగించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్‌గౌడ్, రామస్వామి హరీశ్‌కుమార్, సాయికుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

మైదానం అభివృద్ధి పేరుతో చెట్ల నరికివేత

నిబంధనలకు విరుద్ధం అంటూ విమర్శలు

నర్సాపూర్: మైదానం అభివృద్ధి పేరిట గిరిజన గురుకులం అధికారులు చెట్లను నరికేస్తున్నారు. ప్రభుత్వం చెట్లను పెంచాలని అధిక మొత్తంలో నిధులు ఖర్చుచేసి ప్రచారం చేస్తుంటే గిరిజన గురుకులం అధికారులు మాత్రం చెట్లను నరికేయడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల, కాలేజీ ఆవరణలో త్వరలో జోనల్ స్థాయి క్రీడలు నిర్వహించనున్నారు. అందుకు మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా మైదానాన్ని ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను నరికివేయిస్తున్నారు. అంత వరకు బాగానే ఉన్నప్పటికీ మైదానంతో సంబంధం లేని పెద్ద చెట్లతో పాటు సిబ్బంది క్వార్టర్ల వద్ద ఉన్న చెట్లను సైతం నరికి వేయించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ భిక్షమయ్యను ఫోన్‌లో వివరణ కోరగా.. తాము ఉన్నత అధికారుల ఆదేశాల మేరకే పనులు చేశామని ఆయన వివరించారు.



గురుకులం ఆవరణలో చెట్ల మొదళ్లు, కొమ్మలు

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): తెలంగాణ ఉద్యమంలో సమైక్య పాట పాడి, పన్నెండేళ్ల తర్వాత ఓట్ల కోసం వస్తున్న వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాపన్నపేటలో ఐకేపీ పనిముట్ల కేంద్రం, బాచారంలో డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేలాది మంది తెలంగాణ ఉద్యమంలో తెగించి కొట్లాడి ప్రాణత్యాగాలు చేస్తే, అప్పట్లో సమైక్య వాదం వినిపించి, తిరిగి మెదక్ నియోజకవర్గం నుంచి ఓట్లు అడగడానికి వస్తున్న వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. రాజకీయ అనుభవం లేని వారికి అధికారం అప్ప జెప్పొద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రాములు, వైస్ ఎంపీపి విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జగన్, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కుబేరుడు, ఏఎంసీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపీపీ పవిత్ర దుర్గయ్య, సర్పంచ్‌లు గురుమూర్తి, లింగారెడ్డి, రాజయ్య, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

విద్యార్థులకు మాక్‌పోలింగ్‌పై అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): ఎన్నికల నిర్వహణ తీరుపై పేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ బూత్ నిర్వహణ, ఎన్నికల అధికారులు, ఎన్నికల ఏజెంట్లు, అభ్యర్థుల వివరాలు, బ్యాలెట్ పేపర్, ఓటు వేసే విధానంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని తహసీల్దార్ గ్రేసీబాయ్, ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణ సుభాశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ రాజు తిలకించారు. ఈ కార్యక్రమంలో మండల ఎఫ్‌ఎల్‌ఎన్ మోడల్ అధికారి విజయకుమార్, ఆయా పాఠశాల హెచ్‌ఎంలు వెంకటేశం, రాజేశ్వర్, విఠల్, నాగరాణి, ఉపాధ్యాయ సిబ్బంది శ్రీదేవి, రాధిక, సౌజన్య, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



మాక్ పోలింగ్ పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

సబ్సిడీ పరికరాలను సద్వినియోగం చేసుకోండి

టేక్మాల్(మెదక్): రైతులు సబ్సిడీ ద్వారా వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్ హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ ఫరీ తెలిపారు. మంగళవారం టేక్మాల్‌లోని రైతు సంఘం (ఎఫ్‌పీఓ) సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం సభ్యులకు హార్వెస్టర్‌లు గాని, కోళ్లఫాం, డైరీఫాం, ట్రాక్టర్స్‌తో పాటూ వ్యవసాయ పనిముట్లు, రైతులు ఆర్థికంగా ఎదిగే వాటిపై సబ్సిడీ ఇస్తామన్నారు. ఇందులో ఐఐఎంఆర్ సిబ్బంది రామకిరణ్, సంఘం సీఈఓ వెంకటేశం, చైర్మన్ మొగులయ్య, అకౌంటెంట్ లక్ష్మీనారాయణ, రైతులు సుభాశ్, పెంటయ్య, రాములు, నర్సింలు, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రఫీ

రంగంపేటకు మూడు దళితబంధు యూనిట్లు



ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

కౌల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటకు మరో మూడు యూనిట్లను ఎమ్మెల్యే మదన్ రెడ్డి మంజూరు చేయించినట్లు గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు తలారి దుర్గేశ్ మంగళవారం తెలిపారు. హైదరాబాదులో ఎమ్మెల్యేను మాల, మాదిగలతో పాటు బుడగజంగాలను కూడా దళిత బంధులో స్థానం కల్పించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేశ్‌కుమార్, యువజన అధ్యక్షుడు సుధాకర్, నాయకులు రాజా గౌడ్, తదితరులు ఉన్నారు.

తిరుపతిరెడ్డిని కాంగ్రెస్‌లోకి రప్పించాలి

మండల కార్యకర్తల తీర్మానం

పాపన్నపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన డీసీసీ సభ్యుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డిని తిరిగి పార్టీలోకి రప్పించేలా అధిష్టానం చర్యలు తీసుకోవాలని పాపన్నపేట మండల కాంగ్రెస్ కార్యకర్తలు తీర్మానించారు. మంగళవారం మండలంలోని ఏడుపాయల కమాన్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ఇటీవల పార్టీలో చేరిన మైనంపల్లి హన్మంత్‌రావు, జోక్యం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ రైతు అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ఎంపీటీసీలు శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిరుత కాదు కుక్క

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని తాళ్లపల్లి తండాలో సోమవారం రాత్రి పాడిగేదెపై దాడికి పాల్పడింది. చిరుత కాదని ఊరకుక్క అని అటవీ సిబ్బంది నిర్ధారించారు. మంగళవారం తాళ్లపల్లి తండాకు అటవీ సిబ్బంది చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ సెక్షన్ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ.. పాడిగేదెపై కుక్క దాడి చేసి గాయపరిచిందని చెప్పారు.

బస్సు సర్వీసులు నడపాలి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నర్సాపూర్ నుంచి వెల్దుర్తి మీదుగా తూప్రాన్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సకాలంలో బస్సు సర్వీసులు రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడంతో పాటు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం దూరప్రాంతాలకు వెళ్లే ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఆయా రూట్లలో బస్సు సర్వీసులు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా వినోద్‌నాయక్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా శంశిరెడ్డిపల్లితాండాకు చెందిన వినోద్‌నాయక్‌ను నియమించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17న సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వణుకు మొదలైందన్నారు. మహేందర్‌గౌడ్, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ప్రక్రియను రద్దు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న దళితులు

కౌల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి వచ్చిన దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో సర్పంచ్ గోదావరి ఏకపక్ష నిర్ణయాన్ని అడ్డుకొని, న్యాయం చేయాలంటూ గ్రామానికి చెందిన దళితులు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ విఠల్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి 4 దళితబంధు యూనిట్లు మంజూరయ్యాయి. లబ్ధిదారుల ఎంపికలో సర్పంచ్ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించిదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకే దళితబంధు ఇస్తారా అంటూ ప్రశ్నించారు. సర్పంచ్ ఎంపిక చేసిన లబ్ధిదారుల ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ దళితులు రేగొండ, శ్రీనివాస్, బూదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

100 శాతం పన్నులు వసూలు చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం నిర్దేశించిన పన్నులు 100 శాతం వసూలు చేయాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20 వరకు పెండింగ్‌లో ఉన్న పన్నులు వసూలు చేసి జిల్లాలోనే మొదటి స్థానం పొందాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచేలా కృషి చేయాలన్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల పరిరక్షణ బాధ్యతగా తీసుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. విధులపై అంకిత భావంతో పనిచేస్తే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఓ అనీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. మంగళవారం ఆమె చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలకు పంపిణీ చేసిన క్రీడాపాంగణం కిట్లు సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా నర్సరీల నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రమేశ్, ఈసీ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ హరికృష్ణ

రైల్వే గేటులో తరచూ సాంకేతిక లోపాలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని చేగుంట–మెదక్ రోడ్డులోని రైల్వే గేటు తరచూ సాంకేతిక లోపం వస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం గేట్ లాక్ లోపం ఏర్పడటంతో అరగంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. నిజామాబాద్ – సికింద్రాబాద్ రైల్వే లైన్‌లో రైళ్ల సంఖ్య పెరిగిపోవడంతో పాటు గేట్ లాక్ సమస్యలు వస్తుండటంతో వాహనదారులు గేట్ వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుంటున్నారు. రైల్వే అధికారులు స్పందించి గేట్ లాక్‌లో సాంకేతిక లోపాలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రైల్వే గేటు వద్ద ఆగిపోయిన వాహనాలు

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నర్సాపూర్‌రూరల్: రైతులు పొలంలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని కేవీకేలో శిక్షణ విద్యార్థులు తెలిపారు. మంగళవారం కౌడిపల్లి మండలం తునికివద్ద గల డాక్టర్ డి. రామానాయుడు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) గ్రీన్‌ఫీల్డ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సంకేత, కీర్తి, హర్షిత, కావ్య, శిరీష మండలంలోని అవంచలో రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరితోపాటు ఇతర పంటల్లో చీడపీడలను నివారించుకోవాలని తెలిపారు. ఎకరవరి పంటలో 6 నుంచి 8 వరకు లింకాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవడం వల్ల శత్రు పురుగులను ఆకర్షిస్తాయన్నారు. దీంతో పురుగులు అందులో పడి మరణిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన

కౌల్చారం(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రకటించిన 8 శాతం ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ మండలంలోని చిన్నఘనాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏక పక్షంగా, ఏ సంఘాలను సంప్రదించకుండా 8 శాతం ఐఆర్ ప్రకటించి ముష్టి వేస్తున్న చందంగా వ్యవహరించడం ఉద్యోగ, ఉపాధ్యాయుల్ని అవమానించడమేనన్నారు. 4 డీఏలు కలుపుకొని 18 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతారాములు, రమణ, నగరత్న, సుగుణ, సిద్ధిరాములు, మహేశ్, రుక్మిణి, సిద్ధలక్ష్మి, శోభారాణి, గీత, అఖిల, శారదా, సత్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హవేళిఘనాపూర్(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా కేవలం 5 శాతం మధ్యంతర భృతిని ప్రకటించడాన్ని ఖండిస్తూ యూపీఎస్సీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చిట్యాల పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. మెదక్ పట్టణంలో జరిగిన సమావేశంలో టపాస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం, లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్రంగా అనుమానించిందని అన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాసరావు, బాధ్యులు మాధవరెడ్డి, దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.



హవేళిఘనాపూర్(మెదక్): చిట్యాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రమోషన్‌లు, బదిలీలు వెంటనే నిర్వహించాలి: ఎస్టీయూ

స్కూల్ అసిస్టెంట్‌లు బదిలీ అయిన కేవలం పేపర్ల వరకే పరిమితమైతే తప్ప రాష్ట్రంలో ఇప్పటి వరకు రాష్ట్రంలో 99 మంది శాతం స్కూల్ అసిస్టెంట్లు ఒక్కరు కూడా తమ పాఠశాల నుంచి రిలీవ్ కాలేదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజగోపాల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

క్రీడాకారుల్లో నైపుణ్యం పెంపొందించాలి

జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న లావణ్యరెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): గ్రామీణ ప్రాంతాల్లోని యువతను క్రీడలపై ప్రోత్సహించి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా చూడాలని జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడలపై ఆసక్తి పెంచేందుకు క్రీడా సామగ్రిని పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, మెదక్ పీఏస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆంజనేయులు, జిల్లా క్రీడల యువజన అధికారి నాగరాజు, ఎంపీఓ ప్రశాంత్ తో పాటు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మత్స్యకారులకు అండగా ప్రభుత్వం



చిన్నశంకరంపేట(మెదక్): మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఉచితంగా అందిస్తున్న చేపల పిల్లలను సద్వినియోగం చేసుకోవాలని మత్స్య శాఖ జిల్లా అధికారి రజిని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలను అందించారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల మత్స్య సహకార సంఘం అధ్యక్షులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

◆ జగ్గంపేటలో లడ్డూ వేలం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని జగ్గంపేట గ్రామంలోని హనుమాన్ మందిర్ వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మంటపం వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన లడ్డూ వేలంలో గ్రామానికి చెందిన రైతు బాలకొల్ల పోచయ్య రూ.56 వేలకు దక్కించుకున్నారు. గ్రామంలో గణేశ్ లడ్డు ఇంత భారీ ధరకు వేలమవడం ఇదే ప్రథమమని నిర్వాహకులు తెలిపారు.

◆ కార్యకర్తలను కలుపుకుపోయే నాయకుడు అవసరం



చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్‌లో రాజీనామాల కల్లోలం సద్దుమనగాలంటే కార్యకర్తలను కలుపుకుపోయే నాయకుడు అవసరమని మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాయిలు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి కార్యకర్తలకు అండగా నిలిచిన నాయకుడని, అలాంటి నాయకుడికి అన్యాయం జరగకుండా అధిష్టానం భరోసా కల్పించలేకపోయిందన్నారు. అదిష్టానం ఆలోచించి కార్యకర్తలకు భరోసా కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

◆ రెండు పశువుల పాకలు దహనం

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు రెండు పశువుల పాకలు దహనం అయ్యాయి. గ్రామానికి చెందిన బీరయ్య, మల్లేశం పశువుల పాకలు నిర్మించుకున్నారు. అందులోనే వ్యవసాయ సామగ్రి పెట్టుకున్నారు. ప్రమాదవశాత్తు రెండు పాకలు దహనం అయ్యాయని బాధితులు చెప్పారు. దీంతో బీరయ్యకు రూ: 50 వేలు, మల్లేశంకు రూ:30 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

◆ వేతనాలు చెల్లించండి

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం ప్రతీనెలా ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడు రమశ్ డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పలు రకాల బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం తమను వేదనకు గురి చేస్తుందన్నారు.

◆ పోస్టర్ ఆవిష్కరణ

టేక్మాల్(మెదక్): కురుమ సంఘం భవన నిర్మాణ భూమి పూజ పోస్టర్‌ను టేక్మాల్‌లో మంగళవారం కురుమ సంఘం మండల అధ్యక్షుడు సత్యం ఆవిష్కరించారు.

◆ ఏఎన్‌ఎంల ముందస్తు అరెస్టు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని ఏఎన్‌ఎంలను పోలీసులు మంగళవారం ముందస్తు గా అరెస్టు చేశారు.

◆ గాంధీనగర్‌లో మహిళ సంఘం ఏర్పాటు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా సంఘం కార్యవర్గ సభ్యులను సర్పంచ్ రాజిరెడ్డి సన్మానించి అభినందించారు. మంగళవారం గాంధీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా సంఘం అధ్యక్షురాలు మాసాయిపేట శోభ, ఉపాధ్యక్షురాలు రాజమణిలను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజిరెడ్డి, కిష్టయ్య, రమేశ్‌గౌడ్ ఉన్నారు.

◆ నేడు చైర్ పర్సన్, ఎమ్మెల్యే పర్యటన

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గోమారం గ్రామంలో బుధవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పర్యటించనున్నారని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, గోమారం సర్పంచ్ లావణ్యరెడ్డి తెలిపారు.

◆ ఘనంగా వినాయక నిమజ్జనం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట పంచాయతీ వెంకటాపూర్ గ్రామంలో వినాయక నిమజ్జన శోభాయాత్రను గ్రామస్తులు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకులను ఒకేసారి నిమజ్జనం చేశారు.

